ప్రజాశక్తి
శుక్రవారం 5 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వైవిధ్యం విజయకృష్ణన్ పయనం

◆ నేడు అనకాపల్లి కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ ◆ క్షేత్రస్థాయి పరిశీలనకు అధిక ప్రాధాన్యత ◆ జనంతో మమేకం

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా ◆ 'ప్రజాశక్తి'కి నూతన కలెక్టర్ పలు విషయాలు వెల్లడి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

2013 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ఆమె. క్షేత్రస్థాయిలో నిత్యం పర్యటించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. ప్రజల దగ్గరకు వెళ్తారు.. వారితో మమేకమవుతారు. వారి కష్టాలేంటో అడుగుతారు. పేదలకు రావాల్సిన పథకం ఫలితాలు వారి దరిచేరకపోతే సరిచేసేందుకు వెంటనే ఆదేశాలిస్తారు. కష్టమేంటో తెలుసుకుంటారు. పరిష్కారానికి మార్గం వెతుకుతారు. అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తారు. ఇలా.. విధి నిర్వహణలో ముక్కుసూటిగా, ప్రజలకు చేరువుగా వున్న ఆమె ఎవరోకాదు.. అనకాపల్లి జిల్లా ఆవిర్భావం తరువాత జిల్లాకు రెండో కలెక్టర్‌గా వస్తున్న విజయ కృష్ణన్. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' పలకరించగా ఆమె పలు విషయాలు వెల్లడించారు.



పిల్లలతో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

విజయ కృష్ణన్ భర్త అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్. ఆ దంపతులకు అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. 2013 డిసెంబరు 9న విజయ కృష్ణన్ ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. తొలుత ఉమ్మడి అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, ఎపి టూరిజం అథారిటీ సిఇఒ, ఎఎంఆర్‌డిఎ అదనపు కమిషనర్‌గా, స్టాఫ్ ఆఫీస్ ఛీఫ్ సెక్రటరీగా, జిఎడిలో డిప్యూటీ సెక్రటరీగా, ఎఎంఆర్‌డిఎ కమిషనర్‌గా, సిఆర్‌డిఎ కమిషనర్‌గా, బాపట్ల కలెక్టర్‌గా, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఆమె పలు బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్థానంలో ఇప్పుడు అనకాపల్లి కలెక్టర్‌గా వస్తున్నారు.

ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా దినేష్‌కుమార్, బాపట్ల కలెక్టర్‌గా విజయ కృష్ణన్ పనిచేసినప్పుడు తమ పిల్లలతో కలిసి కూలీలతో పొలంలో వరినాట్లు వేసి, పొలం గట్టుపై భోజనం చేయడం వారి ప్రతిష్టను పెంచింది. దినేష్‌కుమార్ మిగతా 2లో..



విశాఖ నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నీట్ స్కాంపై.. విద్యా సంస్థల బంద్ విజయవంతం

ఎక్కడికక్కడ విద్యార్థుల నిరసన ర్యాలీలు, మానవహారాలు

నీట్ స్కాంపై సమగ్ర విచారణ జరపాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ ఆధ్వర్యాన తలపెట్టిన విద్యాసంస్థల బంద్ జయప్రదమైంది. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. విశాఖలోని కృష్ణా కాలేజీ నుంచి మద్దిలపాలెం జంక్షన్ వరకు, అలాగే జైల్ రోడ్డులోని ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు పిడిఎస్ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, కశింకోట, యలమంచిలి, చోడవరం, రాంబిల్లి, నక్కపల్లి, నర్సీపట్నం తదితర మండల కేంద్రాల్లో విద్యార్థులు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు.

(వార్తలు 5లో..)

జీతాలపై స్పష్టత వచ్చేనా ?

▶ వార్త 2లో..

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పునర్నిర్మాణం చేపట్టాలి

▶ వార్త 2లో..

డిసిఐఎల్ - కొచ్చిన్ పోర్టు కాంట్రాక్టు పొడిగింపు

▶ వార్త 2లో..

యుపిఎస్‌సి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

◆ 14 కేంద్రాల్లో నిర్వహణ

◆ విశాఖలో హాజరుకానున్న 5729 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుపిఎస్‌సి ఈ నెల 7న నిర్వహించబోతున్న ఇపిఎఫ్ఒ, ఇఎస్ఐసి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యుపిఎస్‌సి నియమించిన పరిశీలకులు పరీక్షా కేంద్రాలను శుక్రవారం సందర్శించి పరిశీలిస్తారన్నారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లూ లేకుండా అధికారులు, సూపర్‌వైజర్లు పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యుపిఎస్‌సి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లతో డిఆర్ఒ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంప్లాయి ప్రోవిడెంట్ ఫండ్ ఆర్గనైజషన్ (ఇపిఎఫ్ఒ) పర్సనల్ అసిస్టెంట్స్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించిన పరీక్షలు ఈ నెల 7న జరుగనున్నాయని తెలిపారు. ఇపిఎఫ్ఒ పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, ఇఎస్ఐసి పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 5729 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు యుపిఎస్‌సి మార్గదర్శకాలు తూచా తప్పక పాటించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ప్రశ్నాపత్రాలు చేరిన నాటి నుంచి పరీక్ష పూర్తయి బండిల్స్‌ను యుపిఎస్‌సికి చేరవేసే వరకు నిబంధనలను అనుసరించి పనిచేయాలని లైజనింగ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లకు ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్, మిగతా 2లో..



అనకాపల్లిలో అల్లూరికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు



ఎఎల్.పురంలో అల్లూరి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న

విప్లవ జ్యోతి అల్లూరికి ఘన నివాళి

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గురువారం వాడవాడలా సాగాయి. అల్లూరి స్ఫూర్తి కెరటమని ఎపి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఎఎల్.పురంలో ఉన్న అల్లూరి ఘాట్ వద్ద తలపెట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత అల్లూరి సమాధి వద్ద నివాళ్లర్పించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన తలపెట్టిన అల్లూరి జయంతోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరయ్యారు. (వార్తలు 7, 8 పేజీల్లో..)

మొదటి పేజీ తరువాయి..

వైవిధ్యం విజయకృష్ణన్ పయనం

తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన కాలంలో విజయ కృష్ణన్ రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో కార్పొరేట్ ఆస్పత్రిలో జాయిన్ కాకుండా, పేదలు వైద్యం చేసుకొనే ప్రభుత్వ ఆసుపత్రి పట్ల సాధారణ ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెంపొందించేందుకు రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో విజయ కృష్ణన్ ప్రసవం చేసుకున్నారు. తనకున్న సమయంలో అధికభాగం ప్రజలతో కలిసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇచ్చే స్వభావం ఆమెది.

ఇక అనకాపల్లి జిల్లా విషయానికొస్తే.. వ్యవసాయాధారిత గ్రామీణ ప్రాంతమిది. తక్కువ నీటి వనరులున్న జిల్లా. వరి, చెరుకు సాగే ప్రధానం. ఇక తీర ప్రాంత విషయానికొస్తే.. నక్కపల్లి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో ఔషధ పరిశ్రమలు, అచ్యుతాపురం సెజ్‌లో వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో నిరంతరం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పరిశ్రమల్లో కాలుష్య ప్రమాణాలు పాటించకపోవడంతో కాలుష్య ప్రభావిత సమస్యలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. విశాఖ – చెన్నయ్ కారిడార్, ఎన్ఎఒబి నిర్వాసితులకు జిల్లాలో పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం లభించలేదు. నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో కనీస సౌకర్యాల్లేక గిరిజనులు అవస్థలుపడుతున్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో మురుగునీటి కాలువలు సరిగాలేక కొన్ని దశాబ్దాలుగా పరిష్కారంకాని సమస్యగా దోమల బాధ మిగిలిపోయింది. ప్రాధాన్యతా క్రమంలో నిర్ధిష్ట కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించడానికి నూతన కలెక్టర్ చొరవ చూపుతారన్న ఆశ జిల్లా ప్రజల్లో వుంది. ఈ క్రమంలో 'ప్రజాశక్తి'తో నూతన కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనలకు అధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

యుపిఎస్‌సి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పరీక్షా సమయానికి అరగంట ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష నిర్వహించే రోజున విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయమూ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఎఎన్ఎమ్‌లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్య శాఖాధికారులకు తెలిపారు. తాగునీరు వంటి సదుపాయాలతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి లోపాలూ తలెత్తకుండా పారదర్శకంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో పరీక్షల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, విద్యుత్, ఆర్టీసీ, జివిఎంసి, పోలీస్, రెవిన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిసిఐఎల్ - కొచ్చిన్ పోర్టు కాంట్రాక్టు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కొచ్చిన్ పోర్ట్ అథారిటీ ద్వారా వార్షిక నిర్వహణ డ్రెడ్జింగ్ కాంట్రాక్ట్‌ను పొందినట్లు డిసిఐఎల్ గురువారం ప్రకటించింది. తద్వారా 2024–25 సంవత్సరానికి రూ.156.50 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను మరో ఏడాది పొడిగించినట్లయిందని పేర్కొంది. ఈ సందర్భంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ ముఖ్యమైన ప్రాజెక్ట్ కోసం కొచ్చిన్ పోర్ట్ అథారిటీ తమను ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందన్నారు.

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణలీలలు'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సురభి నాటకోత్సవాల్లో భాగంగా భానోదయ నాట్యమండలి (సురభి) హైదరాబాద్ సభ్యులు విశాఖపట్నం కళాభారతి ప్రాంగణంలో గురువారం ప్రదర్శించిన శ్రీకృష్ణ లీలలు నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఐదో రోజు గురువారం నాటి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ లేబర్ కమిషనర్ డిఆర్‌కె.రావు హైకోర్టు న్యాయవాది కెఆర్.రావు, పెన్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు బడే ప్రభాకర్, బాలబాట మాసపత్రిక సంపాదకురాలు రమణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమనీయ అద్భుత దృశ్య కావ్యంగా శ్రీ కష్ణ లీలలు నాటకం ఉందని అన్నారు.

7న లింబ్, కాలిపర్స్ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉదయపూర్‌కు చెందిన నారాయణ్ సేవా సంస్థాన్ ఆంధ్రప్రదేశ్‌లోని వికలాంగుల కోసం ఉచిత నారాయణ్ లింబ్, కాలిపర్స్ ఫిట్టింగ్, పంపిణీ కార్యక్రమం చేపట్టనుంది. ఈ మేరకు ఈ నెల 7న పోర్టు స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఆ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనుంది. వివరాలను సంస్థాన్ మీడియా అండ్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ భగవాన్ ప్రసాద్ గౌర్ గురువారం దసపల్లా హోటల్‌లో వివరించారు.

జీతాలపై స్పష్టత వచ్చేనా ?

ఎయులో నాన్ టీచింగ్ స్టాఫ్, అధ్యాపకుల ఆందోళన
ప్రభుత్వ నిర్ణయం కోసం యూనివర్సిటీ ఉద్యోగుల నిరీక్షణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంధ్రా యూనివర్సిటీ అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ జీతాలు జూన్ నెలవి పెండింగ్‌లో పడ్డాయి. ప్రభుత్వం మారడంతో ఎయు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఇద్దరూ రాజీనామా చేయడం వల్ల వీరి జీతాల బిల్లుల అప్‌లోడింగ్, బిల్లులపై ముద్ర వేసే నాథుడు లేక ప్రతినెలా 26న పడే జీతాలు ఈ దఫా బాగా ఆలస్యమయ్యాయి. ఫుల్ టైం రిజిస్ట్రార్ కూడా లేకపోవడమే సమస్యకు ప్రధాన కారణంగా ఉంది. ఫైనాన్షియల్ శాంక్షన్ ఎవరిస్తారు ? ఎప్పుడిస్తారో ? అన్న చర్చ తాజాగా ఎయు ఉద్యోగ, సిబ్బందిలో సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర నిర్ణయం తీసుకుంటే తప్ప తమకు జీతాలు అందవని ప్రొఫెసర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ బాహాటంగా చెబుతున్నారు. ప్రభుత్వం చొరవ చేస్తే మినహా ఈ నెలలోనైనా జీతాలు అందేలా లేవని ఆందోళన చెందుతున్నారు.

వర్సిటీలో 200 మంది ప్రొఫెసర్లు, సుమారు 1200 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఆయా డిపార్టుమెంట్లలో పనిచేస్తున్నారు. ఎన్నికల సమయం వేళ మే నెల జీతం ఎన్నికల సంఘం ఆదేశాలతో చెల్లించారు. జూన్ నెల జీతాలు జులైలో చెల్లించాల్సి ఉండగా ఇంతవరకూ పెండింగ్‌లో పడ్డాయి. ఎయుకు ఏటా జీతాల ఖర్చు సుమారు రూ.350 కోట్ల వరకూ ఉంటుంది. నెలకు రూ.32 కోట్లు సరాసరి అంచనా. ఏటా మూడు క్వార్టర్ల కింద డబ్బులు నేరుగా రిజర్వు బ్యాంకు నుంచి ఎయుకు జమ అయ్యేవి. గతంలో ప్రతి నెలా 26న జీతాలు పడేవని నాన్ టీచింగ్ స్టాఫ్ చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలకూ సరిపడా 'బ్లాక్ గ్రాంట్' ఎయుకు ఎప్పుడూ విడుదల చేసేది.

ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాత రిజిస్ట్రార్ కూడా పూర్తిస్థాయిలో లేనందున ఈ పరిస్థితి తలెత్తింది. డబ్బులున్నా ఫైనాన్షియల్ అనుమతులు ఫుల్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ చేయాలి. లేదంటే ప్రభుత్వ ఆదేశాలతో ఆర్థిక శాఖ ఉత్తర్వులివ్వాల్సి ఉంది. ఈ పని ఇంకా జరగలేదు. ఆథరైజ్ చేసే అధికారి లేనందున ఈ సమస్య తలెత్తిందన్నది ఎయులో సర్వత్రా వినిపిస్తోంది.

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పునర్నిర్మాణం చేపట్టాలి



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిఎల్.నారాయణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని పునర్నిర్మాణం చేయాలని కోరుతూ గురువారం పౌర గ్రంథాలయాల సేవా సమితి ఆధ్వర్యంలో దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ మాట్లాడుతూ 2010 వరకు మహారాణిపేట దండుబజారులో సుమారు ఎకరం స్థలంలో ఆహ్లాదకరమైన వృక్ష సంపద మధ్య విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయం విరాజిల్లుతుండేదన్నారు. ఆ స్థలాన్ని 2010లో ఒక పలుకుబడిగల ప్రముఖునికి చెందిన ప్రయివేటు కంపెనీకి లీజురూపంలో దఖలు పరిచారని తెలిపారు. వెనువెంటనే గ్రంథాలయ భవనం నేలమట్టమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయ పరిరక్షణకు పౌర గ్రంథాలయాల సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఉద్యమమే సాగిందని, నగరంలోని విద్యావంతులు, పుర ప్రముఖులు ఆ పోరాటంలో పాలుపంచుకున్నారని తెలిపారు. చివరకు 2019 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆజ్ఞలతో ఆ ప్రయివేట్ కంపెనీతో చేసుకున్న ఒప్పందం రద్దయి స్థలం తిరిగి జిల్లా గ్రంథాలయ సంస్థకు అప్పగించబడిందన్నారు. 2019 ఎన్నికల తర్వాత గ్రంథాలయ పునర్నిర్మాణం కోసం తాము చేసిన విజ్ఞాపనలన్నీ బుట్టదాఖలయ్యాయన్నారు. మంచి గ్రంథాలయం కోల్పోయి విద్యార్థులు, నిరుద్యోగులు, పరిశోధకులు 14 సంవత్సరాలుగా ఇక్కట్ల పాలవుతున్నారన్నారు. గ్రంథాలయ పునర్నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. జిల్లాలోని స్థానిక సంస్థలు ప్రజల నుండి ఆస్తి పన్ను రూపంలో విరివిగా డబ్బులు వసూలు చేస్తున్నాయని, జివిఎంసి గ్రంథాలయ సంస్థకు రూ.200 కోట్లకుపైగా గ్రంథాలయం సెస్ రూపంలో బకాయి పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు.

6 నుంచి జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో ప్రసిద్ధి చెందిన శ్రీ జగన్నాథ స్వామి కల్యాణ రథయాత్ర శనివారం నుంచి ప్రారంభమవుతుందని దేవస్థానం ఇఒ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న సాయంత్రం 4.15 గంటలకు తొలి రథయాత్ర ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌చే ప్రారంభించబడి టౌన్ కొత్త రోడ్డు నుంచి మొదలవుతుందన్నారు. టర్నర్ చౌల్ట్రీ వద్దకు రథయాత్ర చేరుతుందన్నారు. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత, రూ.20, రూ.50, రూ.200 దర్శనాలు వుంటాయని తెలిపారు. రోజూ సాయంత్రం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. భక్తులకు మంచి నీరు, బిస్కట్లు ఏర్పాటు చేశామని, ఈ నెల 25న మహా అన్నదానం నాలుగు వేల మందికి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉత్సవాలకు మొత్తం 2.5 లక్షల మంది వస్తారని, రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని వెల్లడించారు. సమావేశంలో అనంత స్వామి, రంగనాధాచార్యులు పాల్గొన్నారు.

20 శాతం ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల కుదింపు నిర్ణయాన్ని విరమించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇరవై శాతం కాంట్రాక్టు కార్మికులను తగ్గించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు గౌరవ అధ్యక్షులు ఒవి రావు డిమాండ్ చేశారు. ఉక్కు ఎల్ఎంఎంఎం పార్కులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వేలాది మంది పర్మినెంటు కార్మికులు ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందడంతో ఉన్న కాంట్రాక్టు కార్మికులపై ఆ పనిభారం పడిందన్నారు. ఇపుడు కాంట్రాక్టు కార్మికులను కుదిస్తే, ప్లాంట్ నిర్వహణమరింత అధ్వానంగా తయారౌతాయదన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకలుగ చేసుకుని, కాంట్రాక్టు కార్మికుల ఉపాధికి భంగం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి శ్రీనివాసరావు, యు సోమేష్, పి మసేను, చట్టి నర్సింగరావు, వరహాలు, శశిభూషన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు


నోపార్కింగ్‌లో ఉన్న వాహనాలను తొలగిస్తున్న సిఐ

ప్రజాశక్తి - సీతమ్మధార : నగరంలోని 26వ వార్డు క్రౌన్ బేకరీ ఎదురుగా 80 అడుగుల రోడ్డులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నాలుగో పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా నోపార్కింగ్ ఏరియాలో ఉన్న కార్లు, ఆటోలు, బైక్‌లు ఇతర వాహనాలను గుర్తించి, వాటిని తొలగించడంతోపాటు సంబంధిత వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సిఐ అమ్మినాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పుగా ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా,మధ్యలోనూ అడ్డుగోలుగా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని అందిన ఫిర్యాదు మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. రాత్రివేళల్లోనూ పోలీసుల గస్తీ పెంచుతున్నట్లు వెల్లడించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం : విద్యుత్ లైన్లులో మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపిఈపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు. శొంఠ్యాం, మామిడిలోవ, కణమాం 11కెవి ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులను చేపట్టనుండడంతో రామవరం, జి.ఎస్.అగ్రహారం, గొరింట, యర్రవానిపాలెం, భీమన్నదొర పాలెం, కొలవానిపాలెం, కణమాం, పప్పలవానిపాలెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఎఇ సురేష్ కుమార్ కోరారు.

గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మల ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ సందర్భంగా ఈనెల 5న శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు తెలిపారు. పాత మల్లంపేట, శ్రీరాంపురం, పప్పు సెట్టిపాలెం నర్సింబిల్లి, ఎర్రవరం తదితర గ్రామంలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో ఈనెల 5న శుక్రవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారి మహేష్ తెలిపారు.

మూడు నెలల వేతన బకాయి చెల్లించాలని

స్టీల్ హాస్పిటల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న ఉక్కు జనరల్ హాస్పిటల్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న 86మందికి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ వి.వి.రమణ డిమాండ్ చేశారు. గురువారం ఆసుపత్రి వద్ద వివిఎస్‌జిహెచ్ కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేశారుఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులకు వేతనాల చెల్లింపులో వివిఎస్ ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, దీంతో కార్మికులు ఆర్థికభారంతో కుటుంబపోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే స్టీల్ యాజమాన్యం స్పందించి ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా కార్మికులకు జీతాలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరేళ్లుగా స్టీల్ జనరల్ హాస్పిటల్ మెయింటనెన్స్ కాంట్రాక్టర్లు సక్రమంగా పిఎఫ్, పూల్ అండ్ ఫైనల్ చెల్లించకపోయినా స్టీల్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యపరంగా ఎటువంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశ్యంతో రేయింబవళ్లు పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పస్తులు ఉంచడం స్టీల్ యాజమాన్యానికి తగదన్నారు. మూడు నెలల వేతన బకాయి చెల్లింపుతోపాటు, పెండింగ్‌లో ఉన్న ఐదునెలల పిఎఫ్ జమ చేసేలా స్టీల్‌యాజమాన్యం చర్యలు చేపట్టాలని, కాంట్రాక్టుకార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వివిఎస్ ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిఐటియు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ జాయింట్ సెక్రటరి బొట్ట గంగరాజు, సోమేష్ మల్లు సన్యాసిరావు, జి రవణమ్మ, వి దేవిక, టి.వెంకటలక్ష్మి బి నాగేశ్వరరావు, ఎమ్ నర్సింగరావు, జి తాతలు, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

జూపార్కుకు చేరుకున్న కొత్త నేస్తాలు


కొత్తగా వచ్చిన పక్షులను ఎన్‌క్లోజర్‌లో పెడుతున్న జూ సిబ్బంది

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు గుజరాత్, మోటి ఖవ్డి, జామ్నగర్‌లోని రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు మధ్య జరిగిన జంతు మార్పిడి ఒప్పందం ప్రకారం విశాఖ జూ పార్కుకు కొన్ని కొత్త జంతువులు, పక్షులను గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తీసుకు వచ్చారు. రెండు జతల కామన్ మార్మోసెట్, స్కార్లెట్ మకావ్, మిలిట్రీ మకావ్, గ్రీన్ విగ్డ్ మకావ్, మీడియం సల్ఫర్ కాక్టూ, స్క్విరెల్ మంకీ, స్లెండర్ టైల్డ్ మీర్కాట్, ఒక జత రెడ్ నెక్డ్ వాల్బీ విశాఖ జూ పార్కుకు వచ్చాయి. ఇక్కడ నుంచి రెండు స్ట్రిప్డ్ హైనా, రెండు హాగ్ డీర్స్, గ్రీన్ పెలికాన్, పది జతల స్టార్ తాబేళ్ళు, ఒక ఘారియల్, రెండు జంగిల్ క్యాట్, పది ధోల్స్, రెండు పూల్స్, రెండు గార్స్‌లను రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టుకు తరలించారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు తీసుకువచ్చిన కొత్త జంతువులను, పక్షులకు ప్రొటోకాల్ ప్రకారం క్వారంటైన్ ముగిసిన తరువాత సందర్శకుల కోసం సంబంధిత ఎన్‌క్లోజర్లలో విడుదల చేయనున్నట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని దిబ్బడిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంట రవితేజ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, భోజన సదుపాయాల గురించి ఆరా తీశారు. పాఠశాల ప్రాంగణమంతా తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా లైబ్రరీని సందర్శించారు వ్యాపారవేత్త ఘట్టమనేని బోసుబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్ర రాము, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

గుణాత్మక విద్యాబోధన లక్ష్యం కావాలి

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గుణాత్మక విద్యాబోధనను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని భీమునిపట్నం డైట్ లెక్చరర్ సారిపల్లి త్రినాధ రావు అన్నారు. గురువారం అయినాడ, బొత్సపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, "లో కాస్ట్ నో కాస్ట్' బోధనాభ్యాసన సామాగ్రిని ఉపయోగించి, ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన సాగించాలని, ప్రతి విద్యార్థి చదవడం, రాయడం వచ్చేలా మొదట దృష్టిపెట్టి, తర్వాత విద్యార్థులకు మంచి దస్తూరి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక వనరులను వినియోగించుకుని విద్యాబోధన చేసి, బేస్ లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. పాఠశాల్లో విద్యార్థుల నమోదు, హాజరు స్థిరీకరణ పెంచాలని, పాఠశాల లైబ్రరీ వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారువిద్యార్థి స్థాయిలను బట్టి రెమెడియల్ క్లాసులు నిర్వహించాలని, టీచింగ్ నోట్స్, డైరీస్, లెసన్ ప్లాన్స్, రిజిస్టర్స్ విధిగా నిర్వహించాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు గణేష్, సుభాషిణి, ఉపాధ్యాయులు పార్వతి దేవి పాల్గొన్నారు.

జిఒ 117 రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-ఆనందపురం: ప్రభుత్వ పాఠశాలల మనుగడకు గొడ్డలిపెట్టులాంటి జిఒ 117ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు గంగాధరుడు డిమాండ్ చేశారు. గురువారం గుమ్మడివారి పాలెం ఎంపిపి పాఠశాలలో ఎపిటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా గత ప్రభుత్వం అమలు చేసిన జిఒ 117 వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వ విద్య దూరమౌతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన కొనసాగించాలని కోరారు. విద్యాశాఖమంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కోటన శ్రీను, జిల్లా అధ్యాపకులు కరుణాకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మన్యం జిల్లా కార్యదర్శి జి.మురళీకృష్ణ, మండల కార్యదర్శి పి.రమేష్, గౌరవాధ్యక్షులు బాబూరావు, ఈశ్వరరావు, నారాయణరావు, ఉమ, పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి- పెందుర్తి :అనకాపల్లి, ఆనందపురం జాతీయ రహదారి, పెందుర్తి సర్వీస్ రోడ్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి..పెందుర్తి నుండి రాంపురం సర్వీస్ రోడ్డులో వెళ్తున్న మధు అనే వ్యక్తిని ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో, అక్కడికక్కడే మధు (25) మృతి చెందారు. వెదుర్ల నరవ గ్రామానికి చెందిన అరవింద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడు అరవింద్‌ను ఆసుపత్రి తరలించారు. మధు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన వివాహిత డి.ఆశ (27) ఆత్మహత్యకు పాల్పడింది. విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ రాజు వెల్లడించారు. ఇదే గ్రామానికి చెందిన నాగేంద్రబాబుతో తొమ్మిదేళ్ల క్రితం ఆశకు వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త డ్యూటీకి వెళ్లడంతో ఆశ ఇదే గ్రామంలో తన పుట్టింటికి వెళ్ళింది. ఏదైనా పనికి వెళతానని తన తల్లిని అడగగా వద్దని చెప్పడంతో మనస్థాపం చెంది ఈనెల 2న ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

గంజాయిపై ప్రత్యేక నిఘా


రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతమ్మధార: నాలుగో పట్టణ శాంతిభద్రతల విభాగం పోలీసుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు బారిన పడాల్సి వస్తుందన్నారు. రైల్వే స్టేషన్లో గంజాయిపై ప్రత్యేక నిఘాపెట్టి సోదాలు చేశారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.నాల్గవ పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : మండలం గుర్రంపాలెం గ్రామంలో సర్వే నంబర్ 197 198లలో అక్రమంగా గ్రావెల్ తవ్వి, తరలిస్తున్నారనే ఫిర్యాదులపై గురువారం ఆర్‌డిఒ హుస్సేన్, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఏపిఐఐసికి చెందిన స్థలంలో ఉన్న గ్రావెల్‌ను ఏపిఐఐసితోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు తవ్వి తరలించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందన్నారు. మరో రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సమగ్ర పరిశీలన జరిపి, పూర్తి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈసందర్భంగాపెందుర్తిలో సర్టిఫికెట్లను విద్యార్థులు, రైతులు పడుతున్న ఇబ్బందులపై వీఆర్‌ఒలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, రెండురోజుల్లో సంబంధిత సచివాలయాల ద్వారాజారీకి చర్యలు చేపడతామన్నారు.

బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - నక్కపల్లి : మండలంలోని డిఎల్ పురం గ్రామానికి చెందిన గరికిన నాగమణి కేన్సర్ వ్యాధి బారిన పడి మృతి చెందింది. ఈ మేరకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి ఇన్సూరెన్స్ ద్వారా 2 లక్షల చెక్ ను మృతురాలు తండ్రి సింహాచలం కు గురువారం స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి సెల్ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యులు కనకారావు, స్థానిక నాయకులు శ్రీనివాసరావు, గరికిన సింహాద్రి, కొవిరి గంగాధర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఆధునికీకరణకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు పరిధిలోని మారికవలస రాజీవ్ గృహకల్ప కానలీలోని అన్యాక్యాంటీన్ భవన ఆధునికీకరణ పనులకు గురువారం కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ రూ.5లకే పేదలకు నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించే మహత్తర కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించిందని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ (జపాన్), జనసేన అధ్యక్షులు దేవర శివ, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు బోయి వెంకటరమణ, బోయి రమాదేవి, నమ్మి శ్రీను, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం!



మొక్కలు నాటుతున్న ఐలా ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ అన్నారు. గురువారం గాజువాక ఆటోనగర్ అపెరల్ పార్క్ సమీపంలో ఐలా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముగింపును పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. మొక్కల పెంచడం వల్ల మనిషికి కావలసిన ఆక్సిజన్ అందుతుందన్నారు. ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, గాజువాక ఆటోనగర్‌లో అన్ని పార్కులు వద్ద మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు.
ఐలా మాజీ చైర్మన్ శేషగిరి మాట్లాడుతూ, ఆదానీ గంగవరం పోర్ట్ యాజమాన్యం లక్ష మొక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, వాటిని ఆటోనగర్‌లోని అన్ని బ్లాక్‌లో నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో ఐలా భాగస్వామ్యమౌతుందన్నారు.కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ డైరెక్టర్ చంద్రమౌళి, కొల్లి ఈశ్వరరావు, కొల్లి సత్యనారాయణ, వై సాంబశివరావు, కృష్ణప్రసాద్, అట్లూరి రమేష్ పాల్గొన్నారు..

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు



నిత్యావసరాలను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- పద్మనాభం : చెట్టు నుంచి పడిపోయి పని చేయలేని స్థితిలో ఉన్న మండలంలో కృష్ణాపురం గ్రామానికి చెందిన శివన్నారాయణ కుటుంబానికి నెలరోజులకు సరిపడా నిత్యావసరాలతోపాటు రూ.రెండు వేలు ఆర్థికసాయాన్ని గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్ అందజేసింది. సంస్థ సేవకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డికు విషయాన్ని చెప్పిన వెంటనే ఫౌండేషన్ అధ్యక్షురాలు గంటా శారదమ్మ దృష్టికి తీసుకెళ్లి, ఆమె ఆర్థిక సహాయంతో సమకూర్చిన వీటిని నీలాపు శంకరరెడ్డి,కొయ్య శ్రీనివాస్ రెడ్డి, సుమన్, ఆర్.రాజు, చిన్న, నాగేశ్వరరావు తదితరులు బాధిత కుటుంబానికి అందజేశారు.

శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి
ఆధునిక కంటి వైద్య పరికరాల వితరణ

- సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఎల్ఐసి



వైద్యపరికరాలను అందజేస్తున్న ఎల్ఐసి అధికారులు

ప్రజాశక్తి- వేపగుంట :నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ఆధునిక కంటి వైద్యపరికరాలను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) గురువారం అందజేసింది. ఎల్ఐసి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీలో భాగంగా రూ.46లక్షలు విలువచేసే ఓక్యులర్ కోహెరెన్స్ టోమోగ్రఫీ (ఒసిటి), ఫండస్ కెమెరా అనే అత్యాధునిక కొత్త వైద్యపరికరాలను అందజేసింది. వీటిని ఎల్ఐసి సౌత్ సెంట్రల్‌జోన్ జెడ్ఎం పునీత్‌కుమార్, శంకర్ ఫౌండేషన్ జిఎం కె.రాధాకృష్ణన్, ఇతర ఎల్ఐసి, శంకర్‌ఫౌండేషన్ అధికారుల సమక్షంలో ఎల్ఐసి జోనల్ మేనేజర్ ఎల్‌కె.శ్యాంసుందర్ ప్రారంభించారు.

ఎల్ఐసి వితరణగా అందజేసిన ఆధునిక వైద్యపరికరాలతో కంటి రెటీనాలో ఉన్న ాగే రెటీనా స్పెషలిస్ట్ డయాబెటిక్ మాక్యులర్ ఎడెమా, కొరోయిడల్ నియో వాస్కులర్ మెంబ్రేన్ వంటి పలు అసాదారణ రుగ్మతలను సైతం వైద్యులు కచ్చితంగా గుర్తించి, నిర్ధారించడానికి దోహదడుతాయి.

ఈ సందర్భంగా ఎల్ఐసి జెడ్ఎం శ్యాంసుందర్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు శంకర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. రోగుల అంధత్వ నివారణలో కీలకపాత్ర పోషిస్తున్న శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రితో అనుబంధం పెంచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ని ఎల్ఐసి సౌత్ సెంట్రల్‌జోన్ జెడ్ఎం పునీత్‌కుమార్ మాట్లాడుతూ అంధత్వ నివారానికి శంకర్ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు.ఆధునిక వైద్యపరికరాలను వితరణగా అందజేసిన ఎల్ఐసి అధికారులను శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్ ఆహ్వానించగా, ఫౌండేషన్ జిఎం కె.రాధాకృష్ణన్, డిజిఎం రమేష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలోఎల్ఐసి అధికారులు ఉతుప్ జోసెఫ్, రీజినల్ మేనేజర్ శారద ప్రతాప్‌దాస్ , సీనియర్ డివిషనల్ మేనేజర్ పి రాజశేఖర్, మార్కెటింగ్ మేనేజర్ రవికిరణ్, మేనేజర్ వెంకటకుమార్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, శంకర్ ఫౌండేషన్ డాక్టర్లు రవీంధ్ర, కృష్ణ, శిరీష, సుపర్ణ, కృష్ణ తేజ, హెచ్ఆర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగారరాజు, వేణుగోపాల్ డిజిఎంలె ఎన్‌కెఎల్.రావు, ఎజిఎం పాల్గొన్నారు

ఎపిటోరియా ఫార్మా అధికారులకు ముగిసిన గీతం శిక్షణ



సర్టిఫికెట్లను అందుకుంటున్న ఎపిటోరియా ఫార్మా శిక్షణార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రముఖ ఔషధ పరిశ్రమ అరబిందో ఫార్మా లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎపిటోరియా ఫార్మాలో మధ్యస్థాయి మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్న 30మందికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో ఆరు నెలలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎంఎపి) శిక్షణ గురువారంతో ముగిసింది. ఆరోఅస్త్ర పేరిట గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు వివిధ అంశాలలో ఎపిటోరియా అధికారులకు శిక్షణనిచ్చారు. సహోద్యోగులతో బృందంగాపనిచేయడం, సంస్థ ప్రగతిలో వ్యక్తిగత నైపుణ్యాలను ఉపయోగించడం, కాలానుగుణ మార్పులను అర్థం చేసుకుని సవాళ్లను అధిగమించడం వంటి అంశాలోల శిక్షణ పూర్తిచేసుకున్న వారికి స్నాతకోత్సవం తరహాలో వేడుక నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు
ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాపి.పప్పు మాట్లాడుతూ కొత్త అంశాలను నేర్చుకోవడానికి వయస్సు అవరోధం కాదన్నారు. పరిశ్రమలలోని నిపుణు లకు సమకాలీన అంశాలపై శిక్షణ సంస్థల ప్రగతికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వవిద్యా లయాలకు పరిశ్రమలకు మధ్య సంబంధాలు పారిశ్రామిక ప్రగతికి దోహదపడ తాయన్నారు. . ఎపిటోరియా ఫార్మా ఆపరేషన్స్ విభాగం అధిపతి రవినాధశెట్టి మాట్లాడుతూ గత ఏడాది తమ సంస్థలో పనిచేస్తున్న సీనియర్ ఎగ్జిక్యూట్‌లకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిపుణులు ఇచ్చిన శిక్షణ విజయవంతం కావడంతో, సంస్థలోని ఇతర ఉద్యోగులకు అలాంటి శిక్షణనే కొనసాగిస్తున్నట్లు వెల్లడింఆచర.. గీతం శిక్షణ ద్వారా సంస్థ ఉద్యోగులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గీతం కన్సల్టెన్సీ, కొలాబరేషన్స్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్ శాస్త్రి, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీలలిత, ఎపిటోరియా ఫార్మా విశాఖ క్లస్టర్ అధిపతులు మదన్, రంగారావు, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ సి. సుహస్రామ్ పాల్గొన్నారు.

8న వైఎస్ఆర్ జయంతిని
జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ

ప్రజాశక్తి -మధురవాడ: ఈనెల 8న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని విశాఖ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని మాజీ మంత్రి గుడివాడ అమరానాధ్ పిలుపునిచ్చారు. గురువారం ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, రాజశేఖరరెడ్డి జయంతిలో పార్టీ కేడర్ పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. పార్టీ అధినేత జగన్మోహనరెడ్డిని నేతలంతా కలిసి వచ్చామని, మున్ముందు పార్టీ కార్యక్రమాల్లో జగన్ విస్తృతంగా పాల్గొంటారన్నారు. వైసిపి ప్రజాదరణ మెండుగా ఉందని, రాష్ట్రానికి జగన్ నేతృత్వం వహించే రోజులు మళ్లీ రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యలపై పోరాటానికి పార్టీ కేడర్ సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కెకె.రాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి -ములగాడ : ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని నిర్మూలించి, పర్యావరణాన్ని పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక నవజ్యోతి మాక్స్, సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యాన ఆర్‌కె బీచ్‌లో బీచ్ క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విపరీతమైన ప్లాస్టిక్ వాడకంతో భవిష్యత్‌లో మానవాళి మనుగడ ప్రశ్నార్థకమౌతుందన్నారు. సెయింట్ ఆన్స్ నవజ్యోతి మాక్స్ డైరెక్టర్ సిస్టర్ సంగీత మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంపై మహిళలు, యువత చైతన్య కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలన్నారు.ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి నాయకత్వంతో నిర్వహించిన బీచ్ క్లీనింగ్‌లో మహిళలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా పాల్గొని,25 బ్యాగుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, బీచ్‌ను శుభ్రపరిచారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన



గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై పరిశీలిస్తున్న కలెక్టర్, జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- సింహాచలం: ఈనెల 20న ఆషాడ పౌర్ణమి, గురు పౌర్ణమి పురస్కరించుకుని సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గిరిప్రదక్షిణ ఏర్పాట్లను గురువారం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంద్రప్రసాద్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలిసి ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేశారు. జీవీఎంసీ కమిషనర్ కలెక్టర్కు గత ఏడాది గిరిప్రదక్షిణ జరిగిన తీరు, ఏర్పాట్లుపై కొత్త కలెక్టర్‌కు జివిఎంసి కమిషనర్‌తో పాటు దేవస్థానం అధికారులు మ్యాప్‌ల సాయంతో వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్, ఇతర అధికారులకు గిరిప్రదక్షిణ ఏర్పాట్లు విజయవంతంపై పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహించనున్న గిరిప్రదక్షిణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసేలా అన్ని విభాగాలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.ప్రజా ప్రతినిధులతో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లు, చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు.

గిరి ప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించిన జివిఎంసి కమిషనర్

ఎంవిపి కాలనీ: గిరి ప్రదర్శన సాగే అన్ని రోడ్లు మరమ్మతులతోపాటు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. గురువారం సింహాచలం తొలి పావంచా నుంచి హనుమంతవాక, బీచ్ రోడ్డు, సీతమ్మధార, కైలాసపురం, మాధవధార, గోపాలపట్నం తదితర ప్రాంతాలలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. తొలి పావంచా వద్ద రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 8వ జోన్‌కమిషనర్ హేమావతి, పర్యవేక్షక ఇంజనీర్లు వినయ్ కుమార్, రామమోహనరావు, కార్యనిర్వాక ఇంజనీర్లు రత్నాకర్ రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

నీట్ స్కాంపై.. విద్యా సంస్థల బంద్ విజయవంతం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఎక్కడికక్కడ విద్యార్థుల నిరసన ర్యాలీలు, మానవహారాలు



గాజువాకలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

నీట్, యుజిసి, నెట్ పరీక్షా పేపర్ల లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసమర్థ ఎన్‌టిఎను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లాలో గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. బంద్‌కు ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ విద్యార్థి సంఘాలు నాయకత్వం వహించాయి. బంద్‌లో భాగంగా కృష్ణా కాలేజీ నుంచి మద్దిలపాలెం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే పాత జైల్ రోడ్డు ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎయులో బంద్ విజయవంతంగా జరిగింది. అక్కడ కూడా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బంద్‌ను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని, నిందితులను కఠినంగా శిక్షించకుండా దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం అన్యాయమని అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు, పిడిఎస్ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా విద్యా రంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జి.అజయ్, ఎం.కౌశిక్, శ్రావణి, పిడిఎస్ఒ జిల్లా అధ్యక్షులు విశ్వనాథం, కార్యదర్శి వి.లక్ష్మి, జానకి, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీను, సూర్య పాల్గొన్నారు.

గాజువాక : పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. సంఘం జిల్లా అధ్యక్షులు జి.రాము, నాయకులు గుణశంకర్, సాయి, అంజు తదితరులు పాల్గొన్నారు

ఆనందపురం: ఆనందపురం మండలంలో పలు ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించి పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మండలంలోని నారాయణ, శశి, తిరుమల, రవీంద్రభారతి కెకెఆర్ గౌతమి, న్యూలైఫ్ ఇంగ్లీష్ మీడియం, వాగ్దేవి విద్యామందిర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, శ్రీ భారతి విద్యానికేతన్, ఈస్ట్రన్ విశాఖ, ఎస్సార్, చైతన్య భారతి విద్యానికేతన్, వెంకటేశ్వర విద్యామందిర్, గ్లోబల్ తదితర పాఠశాలల్లో బంద్ పాటించి, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

అనకాపల్లి : ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ఒ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బంద్ జయప్రదంగా జరిగింది. బంద్ నేపథ్యంలో అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి మాట్లాడుతూ నీట్ పరీక్షలను నీట్‌గా స్కామ్ చేసేశారని విమర్శించారు. అసమర్థ ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు హరీష్, సింహాద్రి, కుమార్, తరుణ్, రాజేష్, సందీప్, సతీష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కశింకోటలో గురువారం విద్యా సంస్థల బంద్ జయప్రదమైంది. విద్యా సంస్థలు మూతపడ్డాయి. బంద్ నేపథ్యంలో విద్యార్థులు కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దివాకర్, రమేష్, లోకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : విద్యాసంస్థల బంద్ సందర్భంగా చోడవరంలో పిడిఎస్ఒ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ జిల్లా అధ్యక్షుడు ఎన్ భాస్కర్, నాయకులు ఎ.మౌనిక, ధరణి, బి.రాజేష్, రామకృష్ణ, పి.వంశీ, అర్జున్, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

యలమంచిలి : దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ యలమంచిలిలో విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం బాలాజీ, నాయకులు రాఘవేంద్ర, మణికంఠ, రవి, సింహాద్రి, రాజేష్, కృష తాతాజీ, ప్రసాద్, ఎఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, ప్రసాద్, కర్తీక్, దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాంబిల్లి : విద్యా సంస్థల బంద్ రాంబిల్లిలో జయప్రదమైంది. బంద్ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు నాయకుల ఆధ్వర్యాన విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు నారాయణరావు. జి.దేముడునాయుడు, రాము, అప్పారావు, రమణ, రాజు, మురళి, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి : విద్యార్థి సంఘాల కేంద్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది.ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల బాధ్యులు జి అప్పలరాజు, వై.సురేష్ మాట్లాడుతూ, నీట్, నెట్ ప్రశ్నపత్రాల లీకేజీ పై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు బి.శివ రామకృష్ణ, యోగేష్, జగన్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ఎస్.ఎఫ్.ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ జయప్రదమైంద. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ మాట్లాడుతూ, ఎన్ టీఏ రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్షల లీకేజీలపై విద్యార్థులు నష్ట పోతున్నారన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే నెట్, నీట్ పరీక్షల అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ఇక నుండైనా సరైన శిక్షలు అమలు చేసి, కారకులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, సభ్యులు భూషణ్, జ్ఞానేశ్, కిరణ్, లోవ కుమార్, శ్రీను, కిషోర్ తదితరులు పాల్గొన్నారు .



అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న దృశ్యం



కశింకోటలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



యలమంచిలిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

'టచ్ టూల్' విద్యాభివృద్ధికి దోహదం

ప్రజాశక్తి-చోడవరం

టచ్ టూల్ విద్యాభివృద్ధికి దోహదం చేస్తుందని రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. చోడవరం బాలికల పాఠశాలలో 9రోజుల పాటు జరిగే టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా 4వ రోజు ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ అందుబాటులో వుండే సాధారణ తరగతి గది బోధనా నాణ్యతను పరిశీలించడానికి, మెరుగుపరచడానికి అన్ని దేశాలకు సహాయం చేయడానికి ఈ టచ్ టూల్ రూపొందించబడిందని చెప్పారు. సమగ్ర బోధనా సర్దుబాట్లును కలిగి ఉంటుందని, ఇతరులు ప్రవర్తన అంచనాలు కోసం తక్కువ, మధ్యస్థం, ఉన్నత కోడింగ్లకు సర్దుబాటు కలిగి ఉంటాయని, ఈ శిక్షణా కార్యక్రమం అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సాహితీ విద్యా కో ఆర్డినేటర్ శకుంతల, జిల్లా సైన్స్ ఆఫీసర్ కాళిదాసు, జిల్లా సాల్ట్ కో ఆర్డినేటర్ నీతికా, చోడవరం మండలం విద్యాశాఖాధికారి సింహాచలం, కోర్సు డైరెక్టర్ రామిరెడ్డి, మాస్టర్ ట్రైనీలు జగన్నాధ రావు, ఉదయ్ భాస్కర్, బొంజిబాబు, సముద్రం, కుమార్, సతీష్ పాల్గొన్నారు,

జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ నియామకం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో శ్రీజగన్నాథ స్వామి ఉత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ నియమిస్తూ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా దాడి విఎస్.నారాయణ, బోండా రాజేష్, బుగత కోటేశ్వరరావు, అనకాపల్లి మోహన్ రావు, ఎల్లవల్లి ధనలక్ష్మి, బొడ్డేడ వెంకట చలపతిరావు, బుద్ధ లక్ష్మీ అప్పారావులను నియమిస్తూ లేఖ రాశారు. అనంతరం సభ్యులను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అభినందిస్తూ సత్కరించారు.

వాలంటీర్లకు పెండింగ్ జీతాలు పంపిణీ చేయాలని వినతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వాలంటీర్లకు గత మూడు నెలలకు చెందిన జీతాలను తక్షణమే చెల్లించాలని ఎంపిడిఒ ఎస్.రామ్మోహన్ రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గత మూడు నెలలుగా ఎటువంటి జీతాలు చెల్లించలేదని, ప్రభుత్వం తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి అప్పలరాజు, బి రామకృష్ణ, సరోజ, స్వాతి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ పాడి రైతులకు రూ.2.32 కోట్లు బోనస్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు రూ.2 కోట్ల 32 లక్షలు బోనస్‌గా చెల్లిస్తున్నట్లు డెయిరీ జోనల్ మేనేజర్ వి దివాకర్‌రావు తెలిపారు. అచ్యుతాపురం హెరిటేజ్ డెయిరీ ప్లాంట్‌ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల రైతులందరికీ అక్టోబర్ నుంచి మార్చి కాలానికి ఈ బోనస్ చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో డెయిరీ రీజనల్ మేనేజర్ పి తులసి నాయుడు, మేనేజర్ కూండ్రపు శేషు, విశాఖ జిల్లా మేనేజర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. మొగలి పురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి చేతుల మీదుగా, మల్లు నాయుడు పాలెం గ్రామంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, ఎంపీటీసీ గొర్లి కనకరాజు, సర్పంచ్ బోను దేవుడమ్మ చేతుల మీదుగా రైతులకు వరి విత్తనాలు అందజేశారు. ఆరిపాక పంచాయతీలో వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి రాము పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ బంగారు నాయుడు, అంగటి నానాజీ, బోను గంగు నాయుడు, ఆడారి నాగరాజు, పిన్నమరాజు సత్యనారాయణ రాజు,పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణం గవరపాలెం భీశెట్టి అప్పారావు కళ్యాణ మండపంలో గురువారం మల్ల సురేంద్ర చేతుల మీదుగా రైతులకు విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో విల్లూరి హరి, కొణతాల అప్పలరాజు, పెంటకోట శివరాం, కాండ్రేగుల జోగేంద్ర, చదరం శివ అప్పారావు, పెట్ల బాలు, జొన్నాడ సురేష్ పాల్గొన్నారు.



మొగలిపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న టిడిపి నేత గండి బాబ్జి

మహిళల హక్కుల కోసం పోరాడిన వీరవనిత మానికొండ

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళ హక్కుల కోసం పోరాడిన వీర వనిత కామ్రేడ్ మానికొండ సూర్యవతి అని ఐద్వా నాయకులు కొనియాడారు. కామ్రేడ్ మానికొండ సూర్యవతి 32వ వర్ధంతి గురువారం అనకాపల్లి సిఐటియు ఆఫీసులో నిర్వహించారు. సూర్యవతి చిత్ర పటానికి ఐద్వా జిల్లా కోశాధికారి కెవి.సూర్యప్రభ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ 1992లో అప్పటి ప్రధాని పివి నరసింహారావు ఇచ్చిన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేశారని గుర్తు చేశారు. 1993 జూలై నాలుగో తేదీన 150 ప్రజాసంఘాలతో మీటింగ్ నిర్వహించి తిరిగి ఇంటికి వస్తున్న దారిలోనే ఆమె గుండెపోటుకి గురై చనిపోయారని తెలిపారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడినట్లు చెప్పారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, కార్యదర్శి డిడి వరలక్ష్మి, నాయకులు ఆర్ లక్ష్మి, జి సుభాషిణి, నూకరత్నం, యు లోవ, ఎన్ రాణి, యు నాగమణి, ఆర్ వరలక్ష్మి, ఎన్ దుర్గా, యు వాణి తదితరులు పాల్గొన్నారు.



మానికొండ సూర్యవతి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు



మురుగి నీటి కాలువను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

దోమల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి -చీడికాడ : పారిశుద్ధ్య నిర్మూలనపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పంచాయతీ విస్తరణ అధికారి కామేశ్వరరావు తెలిపారు. మండలం కేంద్రంలో గురువారం మురుగునీటి కాలువలను పరిశుభ్రతను పంచాయతీ ఉపసర్పంచ్ రొంగలి రామనాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ, మురుగునీటి కాలువల్లో దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. దోమల నిర్మూలనకు బ్లీచింగ్ చేయిస్తామన్నారు.

గ్రామాల్లో ఫాగింగ్

ప్రజాశక్తి-గొలుగొండ : దోమల నివారణకు మండలంలో పలు గ్రామాల్లో ఆయా పంచాయతీ, ఆరోగ్యశాఖ సిబ్బంది స్ప్రేయింగ్ చేశారు. పుత్తడి గైరంపేట సచివాలయ పరిధిలో ఎన్.కంటారం పంచాయతీ అప్పన్నపాలెం, పెనరద, నల్లంకి కంటారం గ్రామంలో సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఫాగింగ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 9 మందికి జరిమానా

ప్రజాశక్తి-అనకాపల్లి : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 9 మందికి కోర్టు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడపు నాయుడు గురువారం వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 9 మంది పట్టుబడ్డారు. వీరిని అనకాపల్లి 13వ ఎం.ఎం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జ్ బి.విజయలక్ష్మి వాహనదారులకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున మొత్తం 90 వేల రూపాయలు జరిమానా విధించారు.

వీధి కుక్కను తుపాకీతో కాల్చిన వ్యక్తులపై కేసు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెం గ్రామంలో వీధి కుక్కను తుపాకీతో కాల్చి చంపిన వ్యక్తులపై బుచ్చయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. కొండపాలెం గ్రామానికి చెందిన పెద్దాడ శ్రీనివాసరావు ఆ గ్రామంలోని ఒక వీధికుక్క నాటు కోళ్లను తినేస్తుందని కె.పి.అగ్రహారం గ్రామానికి చెందిన యాతగిరి నూకరాజు అనే వ్యక్తితో తుపాకీ కాల్చి చంపడానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ మేరకు యాతగిరి నూకరాజు వద్ద ఉన్న నాటు తుపాకీతో ఆ వీధి కుక్కని బుధవారం కాల్చి చంపారు. కొండపాలెం విఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుచ్చయ్యపేట ఎస్సై డి ఈశ్వరరావు కేసు నమోదు పెద్దాడ శ్రీనివాసరావుని, యాతగిరి నూకరాజుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి వద్ద నుండి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

జూనోసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల : పశువుల నుండి మనుషులకు సంక్రమించే జీనోసిస్ వ్యాధి నివారణ పట్ల గురువారం మండల విద్యాశాఖ అధికారి రామారావు ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాల వద్ద పశు వైద్యులు ప్రతాప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెంపుడు జంతువుల నుండి వ్యాధి సంక్రమించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలను తెలిపారు. పశు వైద్యశాల వద్ద రేబిస్ వ్యాధి నివారణకు పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 జోష్, జి శ్రీనివాస్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు

ఇళ్లు కట్టని లబ్ధిదారులను తొలగించాలి

ఎమ్మెల్యే సుందరపు ఆదేశం

ప్రజాశక్తి - యలమంచిలి

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మాణం చేయని లబ్ధిదారులను తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం జరిగిన యలమంచిలి మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై అధికార్లకు ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. గత ప్రభుత్వం నిర్మించ తలపట్టిన ఇళ్ల పథకంలో వెయ్యి మంది లబ్ధిదారులుండగా అందులో మూడో వంతు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని మండల సమావేశంలో హౌసింగ్ అధికార్లు చెప్పడంతో ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. అవసరం లేని వారికి ఇళ్లు ప్రతిపాదిస్తే ఇలాగే ఉంటుందన్నారు. కార్యక్రమాలు చేపట్టినపుడు ప్రతి పైసా ప్రజల జేబులోనిదని గుర్తెరగాలన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తర్వాత ప్రజలందరి అభీష్టాల మేరకే నడుచుకోవాలని సూచించారు. ఎంపిపి బోదెపు గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలానికి చెందిన ఆయా శాఖాధికార్లతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని ఎస్ఇబి అధికార్లను ఎమ్మెల్యే ఆదేశించారు. జలజీవన్ మిషన్ పట్ల పంచాయతీల్లో అవగాహన కల్పించాలని ఆయా అధికార్లను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాము, వైస్ ఎంపిపిలు శేషగిరిరావు, ఉమాగణేష్, ఎంపిడిఒ అప్పలనాయుడు, మండల అధికార్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాల వల్లే హత్య

- సొంత తమ్ముళ్లే హతమార్చిన వైనం
- డిఎస్‌పి సత్యనారాయణ

ప్రజాశక్తి - యలమంచిలి

కుటుంబ బాంధవ్యాలు, ఆస్తుల ముందు మట్టి కొట్టుకు పోతున్నాయంటూ డిఎస్‌పి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వెలుగులోకి వచ్చిన హత్యోదంతం గురించి గురువారం యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లో విలేకర్లకు వివరించారు. యలమంచిలి భవనం వీధిలో ఉంటున్న బంగారం వ్యాపారి సున్నం సతీష్‌కుమార్‌ను స్వయంగా ఆయన ఇద్దరు తమ్ముళ్లు హత్యచేసినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. సతీష్‌కుమార్ ప్రేమవివాహం చేసుకొన్నాడు. కొన్నాళ్ల తర్వాత ఇద్దరికీ విభేదాలొచ్చి విడిగా ఉంటున్నారు. ఆస్తిలో వాటా అడుగుతున్న అన్నను ఎలగైనా వదిలించుకోవాలని తమ్ముళ్లిద్దరూ ఎ1 సున్నం సాయిమనోజ్, ఎ2 రాజేష్‌లు ప్లాన్ చేసుకున్నారు. 27తేదీన తమ్ముళ్లిద్దరూ అన్న సతీష్‌కుమార్ ఇంటికి వెళ్లారు. గొడవ పడి కొట్టారు. మొహం మీద, ఛాతీ మీద తీవ్రంగా గాయపరిచారు. సతీష్ మృతి చెందాడని నిర్ధారించుకొని, అక్కడే కాసేపు గడిపి అదే రాత్రి ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి సమీపంలో పోలవరం కాలువ వద్ద మృతదేహాన్ని పూడ్చేశారు. 1వ తేదీ నుండి కొడుకు సతీష్‌కుమార్ కనిపించడం లేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటిని పరిశీలించిన పోలీసులకు అనుమానం రావడంతో క్లూస్ టీం కూడా రప్పించి పరిశీలించారు. తమ్ముళ్ల మీద అనుమానం రావడంతో వారిని పోలీసులు ప్రశ్నించారు. విఆర్వో సమక్షంలో వారు తప్పుచేసినట్లు ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయారు. వారిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారని డిఎస్‌పి సత్యనారాయణ వివరించారు. కొత్త చట్టం ప్రకారం గట్టి శిక్ష పడేలా కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు. విలేకర్ల సమావేశంలో సిఐ గఫూర్, టౌన్ ఎస్ఐ పాపినాయుడు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంఈఓ డివిడి.ప్రసాద్ అన్నారు. మండలంలోని రొంగలి నాయుడుపాలెం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల్లో అతిసారం రావడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు సూరిబాబు, ఏఎన్ఎం సత్యవాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని డాక్టర్ కళ్యాణి చెప్పారు. కొండకర్ల గ్రామంలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలలో అతిసార నివారణ, మలేరియా, డెంగీ, చికున్ గునియా వ్యాధులపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సూరిసెట్టి శ్రీనివాస్, వైద్య సిబ్బంది రమ్య, లక్ష్మి, కె.నాగేశ్వరరావు, చిన్ని రమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో బంగారయ్యపేట గ్రామంలో స్టాప్ డయేరియాపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి తరణి, ఆరోగ్య బోధకులు ఎం.ప్రసాద్, ఆర్‌వి సత్యనారాయణ, సిబ్బంది సత్యవతి పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఏడాదికి 100 రోజుల పని కల్పించబడుతుందని గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు అన్నారు. గ్రామంలోని పాత కోపరేటివ్ సొసైటీ వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌పి, మెట్టు గ్రామంలో పనులు ఎక్కడ చేయాలో గుర్తించాలన్నారు. చౌడువాడ పంచాయతీ పరిధిలో చెరువులు ఎక్కువగా లేనందున పనులు అవకాశాలు తక్కువగా ఉన్నాయని, గ్రామంలో గల కొండల ప్రాంతంలో పనులు చేయుటకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అభ్యంతరం తెలుపుతుందని సంబంధిత అధికారులతో మాట్లాడుతానని సర్పంచ్ చెప్పారు. పంచాయతీ పరిధిలో గల అంగన్వాడీ సిబ్బంది ప్రకటించిన మెనూ సక్రమంగా గర్భిణులకు బాలింతలకు కిషోర్ బాలికలకు అందజేయాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయత ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నక్క రామనాయుడు, టిడిపి నాయకులు తనకల పట్టాలు, కుమార అప్పారావు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



వంగవీటి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, పంచకర్ల

వంగవీటి 77వ జయంతి

ప్రజాశక్తి-పరవాడ : వంగవీటి మోహన రంగా 77వ జయంతి జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం జంక్షన్లో పరవాడ తూర్పు కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మడక రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి కులాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు కె. వాసుదేవరావు, బంతికోరు గోవిందరాజు, రాఘవా పురపు శ్రీనివాస్ కుమార్, గొల్లవిల్లి నానాజీ, సూరిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని రైవాడ గ్రామ సమీపంలో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని మాడుగుల, పెందుర్తి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా దోపిడీ, దౌర్జన్యాలపై ఎదిరించినట్లు చెప్పారు. సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పివిజి కుమార్, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, రాయపరెడ్డి కృష్ణ, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, గుమ్మడి శ్రీరామ్, చల్లా లక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ : విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకో వాలని జిల్లా విద్యాశాఖ అధికారిని వెంకట లక్ష్మమ్మ కోరారు. మండలంలో ఏ ఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన చాలా ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో విద్యను నేర్చుకుంటేనే ఉన్నత విజయాలు సొంతమవుతాయన్నారు. విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం వరలక్ష్మి, జి.చిన్నారావు, వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మేకలు, గొర్రెల పెంపకందారులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జీవాలు మృత్యువాత పడకుండా కాపాడుకోవచ్చునని పశు వైద్య సహాయ సంచాలకులు దినేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక పశు వైద్య ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. గొర్రెల్లో సీజనల్గా వచ్చే న్యూమోనియా జబ్బుతో ఎక్కువగా మృత్యువాత పడతాయని చెప్పారు. ప్రతి మూడు నెలలకోసారి నట్టల నివారణ మందును వాడాలన్నారు. ప్రభుత్వం సంవత్సరంలో రెండు దఫాలు ఉచితంగా ఇస్తుందని, మరో రెండు దఫాలు పెంపకందారులు కొనుగోలు చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఈ మందును వాడినట్లయితే 90 శాతం మరణాలు తగ్గించుకోవచ్చని చెప్పారు. మేకలు గొర్రెలకు ఎటువంటి రోగాలు సంభవించిన గ్రామాల్లో ఉన్న పశువైద్య సహాయకులను సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీల సమస్యలపై ఎమ్మెల్యే రాజుకు వినతి

ప్రజాశక్తి-చోడవరం : తమ సమస్యల పరిష్కరించి, వేతనాలు పెంపుదల చేయాలని అంగన్వాడీలు స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుకు గురువారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న నేటికీ రూ.11,500 జీతంతో జీవితాలను నెట్టుకొస్తున్నామని, ప్రభుత్వాలు మారిన కనీస వేతనం అందుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అల్లూరిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

జయంతి సభల్లో వక్తలు



నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఎఎల్ పురం అల్లూరి ఘాట్ వద్ద అల్లూరి సీతారామరాజు జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టిలు అల్లూరి గంటందొర సమాధులకు ఘన నివాళు లర్పించారు. సమాధుల వద్ద శిధిలమవుతున్న పైకప్పు మరమ్మతులు చేపట్టాలని అయ్యన్న కలెక్టర్‌ను ఆదేశించారు.అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో పార్క్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సభా వేదికపై అయ్యన్న మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజును ప్రస్తుత యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎంపీ నిధులు 50 లక్షలతో పార్కులు అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పర్యాటక శాఖ అధికారులతో మాట్లాడి పార్కులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి మాట్లాడుతూ,అల్లూరి నడియాడిన ప్రాంతాల్లో తాను విధులు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టరును అయ్యన్న సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ,. జిల్లా పంచాయతీ అధికారిని శిరీష రాణి, నర్సీపట్నం ఆర్డిఓ జయరాం, నర్సీపట్నం రూరల్ సీఐ హరికృష్ణ, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, డిప్యూటీ తహసిల్దార్ రాజ్ భారత్, ఎంపీడీవో రమాదేవి, నర్సీపట్నం నియోజవర్గ జనసేన ఇన్చార్జ్ రాజాన సూర్యచంద్ర, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీపీ మణికుమారి. మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

అల్లూరి చిత్ర కళా మందిరం ప్రారంభం

గొలుగొండ: అల్లూరి చరిత్ర సంబంధించిన కళాఖండాలు విద్యార్థుల పరిశోధనలకు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపాఉ. మండలంలో ఏ ఎల్ పురం అల్లూరి సీతారామరాజు స్మారక పార్కులో అల్లూరి జాతీయ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఏర్పాటు చేసిన "అల్లూరి చిత్రకళా మందిరం"ను గురువారం అయ్యన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటువంటి చిత్రకళా మందిరాలు మన చరిత్రను భావితరాలకు తెలియజేస్తాయని కొనియాడారు. జాతీయ అల్లూరి సీతారామరాజు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. అల్లూరి చిత్రకళ మందిరం" ఏర్పాటుకు దోహదపడిన దాతలను సత్కరించారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కోశాధికారి బళ్ళా శ్రీనివాస్, వెల్లాల నాగార్జున, శ్రీకాంత్‌లు అల్లూరి చిత్రపటాన్ని స్పీకర్‌కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి శత వర్ధంతోత్సవ కమిటీ కార్యదర్శి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ఆవిష్కరణ

గొలుగొండ: అల్లూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని అనకాపల్లి జిల్లా ఎస్ పీ కె.వి.మురళీకృష్ణ కోరారు. మండలంలో ఏ ఎల్ పురం అల్లూరి మైత్రి గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులు, ఉపాధ్యాయులు, స్థానికులు కలిసి అల్లూరి మైత్రి పేరిట గ్రంథాలయాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తే తాను నిధులు కేటాయిస్తానని ఆయన తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి మోహన్, సీఐలు సోమశేఖర్, ఉదయ్ కిరణ్, స్వామి నాయుడు, వెంకటరమణ, హరి, ఎస్ఐ ఉపేంద్ర, ప్రముఖ వైద్య నిపుణులు రాజశేఖర్, గొలుగొండ ఎంపీపీ మణికుమారి, స్థానిక సర్పంచ్ లోచల సుజాత, గ్రంథాలయ నిర్వాహకులు పల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవో సీతారామరాజు, వేంపాడు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించారు.అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, వైసీపీ నేత వీసం రామకృష్ణ, టిడిపి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, క్షత్రియ సంఘం నాయకులు, ఈఓపిఆర్డి సత్యనారాయణ, ఎంఈఓ నరేష్‌లు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని నర్సీపట్నం టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.త్రిమూర్తులు యువతకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అతి పిన్న వయసులోనే అల్లూరి అమాయకులైన గిరిజనులను చైతన్యవంతం చేసి పోరాట యోధులుగా తయారు చేశారని కొనియాడారు.సీనియర్ విశ్రాంత లైబ్రేరియన్ మురళీకృష్ణ మాట్లాడుతూ, విశ్రాంత వ్యాయామ పాద్యాయులు పి.ప్రభాకర్, గ్రంథాలయాధికారి దమయంతి పాల్గొన్నారు.

అల్లూరికి గణేష్ నివాళి

నర్సీపట్నం టౌన్ :స్థానిక వైసిపి క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అల్లూరికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతి చిన్న వయసులోనే అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలు అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చింతకాయల సన్యాసి పాత్రుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, సచివాలయాల కోఆర్డినేటర్ తమరాన శ్రీను పాల్గొన్నారు

కోటవురట్ల:మండల కేంద్రంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఇంచార్జ్ ఉపతహసిల్దార్ నాని బాబు, ఏవో చంద్రశేఖర్, ఆర్ఐ ఊర్ధవరావులు అల్లూరికి ఘనంగా నివాళి అర్పించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అల్లూరి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేట్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, అధికారులు బి.రాజేశ్వరరావు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఇతర అధికారులు అల్లూరికి శ్రద్ధాంజలి ఘటించారు. అనకాపల్లి జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బెహరా ప్రసాదరావు, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ డిడి ప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య నివాళులర్పించారు. మామిడిపాలెం జెడ్‌పి హైస్కూల్లో హెచ్ఎం బి.శ్రీధర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, ఉత్తరాంధ్ర చర్చావేదిక యువజన కార్యాలయంలో బుద్ధ రాజేష్, మామిడిపాలెం గిరిజన కోలనీలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, అనకాపల్లి గూడ్స్ రోడ్ సెంటర్ వద్ద అనకాపల్లి నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ద్రాక్షారపు వెంకటరమణ ఆధ్వర్యాన నివాళులర్పించారు. తుమ్మపాల మెయిన్ రోడ్లో అల్లూరి విగ్రహానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కర్రి బాబి, చదరం నాగేశ్వరరావు, పీలా తాతునాయుడు, అనకాపల్లిలో అల్లూరి విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు తదితరులు అల్లూరికి శ్రద్ధాంజలి ఘటించారు.

దేవరాపల్లి : మండల కేంద్రం రైవాడ అతిథి గృహం అల్లూరి చిత్ర పటానికి మాడుగుల, పెందుర్తి శాసనసభ్యులుబండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, రాయపురెడ్డి కృష్ణ, పివిజి.కుమార్ పాల్గొన్నారు

చోడవరం : మండలంలోని గోవాడలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహాశీల్దారు కార్యాలయంలో సిబ్బంది, స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ టి రాధాకృష్ణ అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కశింకోట : మండలంలోని గబ్బూరులో తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, నైనముశెట్టి రమణ రావు, ఉల్లింగల రమేష్, జెరరిపోతల నూకినాయడు, మల్ల సూర్య రావు, మల్ల బాబు, తాళ్ళపాలెం సచివాలయం వద్ద డాక్టర్ గల్లారాజు, సర్పంచ్ రెల్లి నాగయమ్మ, కార్యదర్శి సత్యరావు, కశింకోటలో ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యాన అల్లూరి జయంతి వేగుకులు జరిగాయి.

పద్మనాభం : అల్లూరి జన్మస్థలం మండలంలోని పాండ్రంగిలో సీతారామరాజు 127వ జయంతిని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. అల్లూరి సొంతింటిలో ఉన్న పాతవిగ్రహాలను తొలగించి, కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన కొత్త విగ్రహాలకు భీమిలి ఆర్‌డిఓ భాస్కరరెడ్డి, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ కె శ్రీనివాస్‌పాణితోపాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి స్థానిక జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి మోహిత్ అల్లూరి వేషధారణ, అదే పాఠశాలకు చెందిన రేష్మ భరతమాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డిపి అప్పలనరసింహారాజు. టూరిజం ఇన్ఫర్మేషన్ అధికారి కె.జ్ఞానవేణి, సర్పంచ్ ఝాన్సీ, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు. టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.లీలావతి, అనంత పద్మనాభ స్వామి సేవా సంఘం అధ్యక్షులు గోపిబాబు, తహశీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు. కాగాప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన అల్లూరి జయంతికి కూటమి నేతలకు ఆహ్వానాలు లేవని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కురిమిన రామస్వామినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

మధురవాడ : స్థానిక స్వతంత్రనగర్ ప్రభుత్వ వైద్యశాలలో అల్లూరి విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం అధ్వర్యంలో అధ్యక్షుడు నాగోతి సూర ప్రకాష్ పూలమాల తో ఘనంగా నివాళులర్పించారు. యు పిహెచ్ వైద్యధికారి మానసలక్ష్మీ, బెల్లపు పాపారావు, శ్రీపాద వెంకటరమణ, వంటాకుల శ్రీనివాసరావు, బి.సతీష్ కుమార్, పి నాగేశ్వరరావు వెంకట బ్రహ్మాజీ రావుపాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి తహశీల్దార్ హేమంత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఆర్ఐ మణికంఠ పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక మండల పరిషత్‌ప్రాంగణంలో ఉన్న అల్లూరి విగ్రహానికి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఇఒపిఆర్‌డి, గుండు అప్పలరాజు, హౌసింగ్ ఎఇ హుస్సేన్, సింగనబంద సర్పంచ్ జివి నారాయణ, టిడిపి నాయకులు గాడు తాతి నాయుడు పాల్గొన్నారు

స్థానిక బీచ్ అల్లూరి పార్కులో సీతారామరాజుకు టిడిపి నాయకులు గంటా నూక రాజు, గొలగాని నరేంద్ర కుమార్, పి లక్ష్మీ కుమారి, కొక్కి రి అప్పన్న, ఎం సంజీవ్‌కుమార్ నివాళులర్పించారు.

ఒకటో వార్డు, బంగ్లా మెట్ట ప్రాథమిక పాఠశాలలో హెచఎంతోపాటు మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్,

టిడిపి వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, కృష్ణంరాజు పేట ఎంపిపి పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు సత్యనారాయణ, భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు అల్లూరికి నివాళులర్పించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముందుగా అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

నాల్గో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఎఎంసి మాజీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ పాల్గొన్నారు

సీతమ్మధార: సీతమ్మధారలో అల్లూరి విగ్రహానికి క్షత్రియ సమితి ,క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కె కె రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్న పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు కార్యక్రమంలో ఎంఎస్ఎన్ రాజు, డిఎస్‌వి.వర్మ బుల్లి బాబు, కోడూరిపాటి శ్రీను, అంజి రాజు పాల్గొన్నారు

ఎపిఇపిడిసిఎల్‌లో..

సీతమ్మధార: ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం, సంస్థ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎం.రామకష్ణ, డి.సుమన్ కళ్యాణి, అచ్చి రవికుమార్, జె.శ్రీనివాసరావు, ఎస్.మసిలమణి, ఎస్.హరిబాబు, ఎన్.వి.రమణమూర్తి, జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం : సింహాచల దేవస్థానం కార్యనిర్వహక కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎఇఓ ఆనంద్‌కుమార్, దేవస్థానం అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మధురవాడలో నివాళి అర్పిస్తున్న నాయకులు

పర్యాటకులకు బస్ సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:అల్లూరి సీతారామరాజు నడయాడిన పద్మనాభం మండలం పాండ్రంగి నుండి అనకాపల్లి, అల్లూరి స్మారక మందిరం ప్రాంతం కృష్ణదేవిపేట వరకు పర్యాటకులకు బస్సు సౌకర్యం కల్పించాలని వెనుకబడిన వర్గాల సంఘ సభ్యులు కే.శివ నారాయణ రాజు కోరారు. గురువారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో ఇన్చార్జి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి జ్ఞాపకాలను సందర్శించేందుకు బస్సును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అరవింద్ కుమార్ రాజు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

మహనీయుడు అల్లూరి


యలమంచిలిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

అల్లూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. అల్లూరి జయంతి వేడుకలను విశాఖ, అనకాపల్లి జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు.

అనకాపల్లి: మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో అల్లూరి చిత్ర పటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ అల్లూరి ఏజెన్సీలో గిరిజనుల హక్కుల కోసం ఉద్యమించి, దేశంకోసం ప్రాణాన్ని త్యాగం చేశారని తెలిపారు. నేటి ప్రభుత్వాలు అల్లూరి స్ఫూర్తికి విరుద్ధంగా గిరిజనుల హక్కులు, చట్టాలను తుంగలోకి తొక్కుతున్నాయని విమర్శించారు. అల్లూరి ఆశయ సాధన కోసం ప్రజా పోరాటాలను విస్తృతంగా నిర్వహించడమే ఆయనకి మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.శంకరావు, అల్లు రాజు, జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, డిడి.వరలక్ష్మి, పి.మాణిక్యం, ఆర్.లక్ష్మి, పి.చలపతి, బి.నూకఅప్పారావు, సూర్యప్రభ, ఎం.రమణ పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక మార్కెట్ వద్ద ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో రాంబాబు, జి.కన్నారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు దివాకర్ ,మణికంఠ పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న అల్లూరి వాకర్స్

పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లిలో సిఐటియు ఆధ్వర్యాన ఉపాధి హామీ కార్మికులు అల్లూరి జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధి హామీ కార్మికులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, కాసులమ్మ, వరలక్ష్మి, రత్నం, ధనలక్ష్మి, నూకాలమ్మ, అప్పల నరసింహ, అప్పారావు పాల్గొన్నారు.

యలమంచిలి : అల్లూరి 127వ జయంతి వేడుకలు స్థానిక బిసి కాలేజీ హాస్టల్లో గురువారం ఘనంగా జరిగాయి. హాస్టల్ వార్డెన్ శైలజ, సిఐటియు ప్రతినిధి సిహెచ్ శివాజీ అల్లూరి చిత్రపటానికి పూలు మాలలు వేశారు. గిరిజనుల హక్కుల కోసం వీరోచితంగా వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జల్ల శ్రీను, నాయకులు సిహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి మండల కేంద్రంలో అల్లూరి విగ్రహానికి అల్లూరి ప్రజాసంఘాల అభివృద్ధి వేదిక నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూపతి అప్పారావు, జి దేవుడు నాయుడు, నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జయంతి

గొలుగొండ: చీడిగుమ్మల, చోద్యం గ్రామాలలో సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, పిన్న వయసులోనే బ్రిటీషు సామ్రాజ్యంపై పోరాటం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎల్.వి. రమణ, జి.రాధాకృష్ణ, వైస్ ఎం.పీ.పీ సుర్ల ఆదినారాయణ పాల్గొన్నారు



సిఐటియు రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న కార్మికులు

సిఐటియు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

విశాఖ కలెక్టరేట్ : కార్మిక హక్కుల పరిరక్షణ కోసం అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ఉధృత పోరాటాలను నిర్వహిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీన్ని డిప్యూటీ పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్ – విశాఖపట్నం 1) బి.లక్ష్మీనారాయణ, ఈస్ట్ ఎసిపి జయరాం ప్రసాద్, లయన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి డిసిపి లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సిఐటియు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం వంటి పెద్ద నగరంలో నిత్యం యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, అనేక మంది గాయపడుతున్నారని, రక్తం అందక ఎక్కువ మంది చనిపోతున్నారని అన్నారు. ఇటువంటి రక్తదాన శిబిరాలతో వారి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ఎసిపి జయరాంప్రసాద్ మాట్లాడుతూ అల్లూరి పేరుతో ఇటువంటి రక్తదానాలు చేయడం ఆనందదాయకంగా ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాటాలే కాకుండా తమ సంఘం ఇటువంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోందని తెలిపారు. డిసిపి, ఎసిపి, లయన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్‌లకు సిఐటియు ముద్రించిన 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' పుస్తకాన్ని అందజేశారు. రక్తదాతలకు సిఐటియు రాష్ట్ర ప్రథమ అధ్యక్షులు పర్సా సత్యనారాయణ జ్ఞాపకాలతో కూడిన పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు కెఎం.కుమార్ మంగళం, పి.మణి, జి.అప్పలరాజు, లక్ష్మణమూర్తి, బి.వెంకటరావు, వి.నరేంద్ర కుమార్, డి.అప్పలరాజు, ఒ.అప్పారావు, యు.రాజు, టి.నూకరాజు, చంద్రమౌళి, కృష్ణారావు, సుబ్బారావు, రాజ్ కుమార్ పాల్గొన్నారు. శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు.

అల్లూరికి ముఠా కార్మికుల నివాళి

పూర్ణా మార్కెట్‌లో ఉన్న అల్లూరి విగ్రహం వద్ద విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వై.రాజు ఆధ్వర్యాన ముఠా కార్మికులు ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమానికి ఎం.సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఠా కార్మికుల నాయకులు పైడిరాజు, లక్ష్మణ్, నాయుడు, మత్స్యకారుల నాయకులు కె.చంద్రశేఖర్, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.

అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన..

విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. సీతమ్మధార కూడలిలోని అల్లూరి విగ్రహానికి విశ్రాంత పిఎఫ్ చీఫ్ జాయింట్ కమిషనర్ ఎస్‌విఎస్ఎస్.రామచంద్రరాజు, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి నరసింహరాజు, ఎన్.సంజీవయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో సమాజ పురోగతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిఎస్.రాజు, చైతన్య ప్రసాద్, ఎన్.వెంకటరావు, నాగేశ్వరరావు, టి.శాంతారాం, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 62వ వార్డు ఎజి కాలనీలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పి.రామారావు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ, దేశస్వాతంత్ర్యానికి, గిరిజనం బానిస వ్యక్తికి తెల్లదొరలతో పోరాడిన మహాపోరాటయోధుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో బి.జగ్గునాయుడు అర్జునరావు, ఎల్.కృష్ణారావు, ఎం.గణేష్, నీలకంఠం, సంతోష్ పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి యూనియన్ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సిపిఐ కార్యాలయంలో పార్టీ నాయకులు అల్లు బాబూరావు, కె రాంబాబు అల్లూరికి నివాళులర్పించారు.


అల్లూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంవిఎస్ శర్మ, తదితరులు

ఘనంగా ముగిసిన అల్లూరి జయంతోత్సవాలు

విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులపాటు తలపెట్టిన అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి 25 సంవత్సరాలకే భారతదేశ దాస్య సంకెళ్ల విముక్తికి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని తొమ్మిది మండలాల్లో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం దేశమంతా పాకిందని, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. అటువంటి విప్లవ జ్యోతి అల్లూరి జయంతి కార్యక్రమాలను మూడు రోజులపాటు ఎంతో చక్కగా నిర్వహించిన వారికి అభినందనలు తెలిపారు. గురజాడ సాంస్కృతిక వేదిక సహాయ కార్యదర్శి ఆర్ఎస్ఆర్.మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగిన కార్యక్రమాల వివరాలు, స్పందనను తెలియజేశారు. సభలో డాక్టర్ పికె.జోష్, జబర్దస్త్ రాపేటి అప్పారావు, డాక్టర్ విజయవేణి, డాక్టర్ కె.రమాప్రభ, ఎం.జగ్గునాయుడు, విఎస్.పద్మనాభరాజు మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన అందరికీ ప్రశంసా పత్రాలు అందించారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

పెదతీనార్లలో గ్రామసభ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పెదతీనార్ల గ్రామ పంచాయతీ వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అన్ని విధాలుగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి అప్పలరాజుకు సూచించారు.



మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యులు నాగేశ్వరరావు